
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
3
బుధవారం 31 జూలై 2024



ఆలయ చైర్మన్ పదవి గొల్ల, కురుమలకు ఇవ్వాలి

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

చేర్యాల, జూలై 30 : గొల్ల, కురుమల ఆరాధ్య దైవమన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ చైర్మన్‌గా గొల్లకురుమలకు అవకాశం కల్పించాలని ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మల్లన్నఆలయ కమిటీ చైర్మన్ నియామకంపై ప్రస్తావించారు.



ములుగు మండలం వంటిమామిడి వద్ద..



కుకునూరుపల్లి వద్ద భారీ గుంతలు



కోహెడ మండలం శంకర్‌నగర్ వద్ద కారు ప్రమాదం (ఫైల్)

రాజీవ్ గుంతలదారి..!

- చిన్నపాటి వర్షాలకే రిపేర్లు
- ప్యాచ్‌వర్కులతోనే సరిపెడుతున్న వైనం
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- ఏడునెలల్లో 75 ప్రమాదాలు.. 26మంది మృతి
- మరమ్మతులు అంతంతే.. వసూళ్లు ఎంతగానో..
- రాజీవ్ రహదారి నిర్వహణపై విమర్శల వెల్లువ



కొండపాక మండలం దుద్దెడ సమీపంలో..



చిన్నకోడూరు మండలం రామునిపట్ల వద్ద జరిగిన ప్రమాదంలో మృతులు (ఫైల్)

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 30: సిద్దిపేట జిల్లాలో విస్తరించిన రాజీవ్ రహదారి నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టోల్‌ట్యాక్స్ పేరిట భారీగా వసూళ్లు చేపడుతున్నారే తప్ప వాహనదారుల ఇబ్బందులను విస్మరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ములుగు మండలం వంటిమామిడి నుంచి బెజ్జంకి మండలం దేవక్కపల్లి వరకు జిల్లా మీదుగా ఈ రోడ్డు విస్తరించింది. కరీంనగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిగా పేరున్న ఈ దారిలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. జిల్లాలో సుమారు 90 కిలోమీటర్ల మేర ఈ రహదారి విస్తరించి ఉన్నది. హైదరాబాద్ నుంచి గజ్వేల్, సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి మీదుగా రామగుండం వరకు ఈ రహదారిని నిర్మించారు. సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల వెళ్లాల్సిన వాహనాలు కరీంనగర్ వరకు ఈ దారి గుండానే రావాల్సి ఉంటుంది. నిత్యం ఈ రహదారి వాహనాలతో రద్దీగా మారుతోంది. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వరకు నిత్యం రాకపోకలు సాగించేవారి సంఖ్య కూడా అధికంగా ఉంది. అయితే, రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో వాహనాలు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాల బారిన పడుతున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు..

రహదారిపై గుంతలు ఏర్పడడంతో వాహనాల వేగం హఠాత్తుగా తగ్గించాల్సి వస్తోంది. దీంతో వెనకనున్న వాహనాలు ఢీకొడుతున్నాయి. ఒక్కోసారి గుంతలను తప్పించే క్రమంలోనూ వాహనాలు డివైడర్లను ఢీకొట్టడం.. లేదంటే రోడ్డు దిగిపోవడం జరుగుతున్నాయి. గుంతలపై ప్రయాణం కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయనే విమర్శలు కూడా లేకపోలేదు. జనవరి నుంచి ఇప్పటిరకు రాజీవ్ రహదారిపై జిల్లా పరిధిలో 75 ప్రమాదాలు చోటు చేసుకున్నాయంటే అతిశయోక్తి కాదు. ఈ ప్రమాదాల్లో 26 మంది మరణించారు. 96 మంది గాయపడ్డారు. గాయపడినవారిలో శాశ్వత వైకల్యం పొందిన బాధితులు సైతం లేకపోలేదు. ఓ వైపు పోలీసులు తగిన చర్యలు చేపడుతున్నప్పటికీ వాహనాల వేగం అదుపులోకి రావడం లేదు. దీనికి తోడు గుంతల కారణంగా ప్రమాదాల సంఖ్య పెరగడానికి ఆస్కారం ఏర్పడుతోంది.

మొక్కుబడిగా మరమ్మతులు

గుంతలు పడగానే మొక్కుబడిగా ప్యాచ్‌వర్క్‌లు వేసి చేతులు దులుపుకోవడం సర్వసాధారణమైంది. ఇటీవల కురిసిన సాధారణ వానలకే రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. కిలోమీటర్ల కొద్దీ అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయి. వీటిని తారుతో నింపే ప్రయత్నం చేస్తున్నారు. మళ్లీ వర్షం పడగానే ఈ తారు తేలిపోతోంది. ఇంకా కొన్నిచోట్ల మరమ్మతుల జోలికే వెళ్లడం లేదు. ఇప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేస్తే మళ్లీ వర్షానికి తేలిపోతుందని జాగ్రత్త పడుతున్నారు. దీనివల్ల వర్షాకాలం ముగిసేదాకా గుంతల మధ్య నుంచే ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి. తూతూ మంత్రంగా ప్యాచ్‌వర్క్‌లు చేసే బదులుగా రాజీవ్‌రహదారిపై ఒక బలమైన తారు లేయర్‌ను వేస్తే ఫలితం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వసూళ్లు ఫుల్..నిర్వహణ నిల్

సాధారణంగా రహదారుల నిర్వహణ ఆధారంగానే టోల్ పన్నును వసూలు చేస్తుంటారు. హైదరాబాద్ చుట్టూ విస్తరించిన రింగురోడ్డును నిత్యం పర్యవేక్షిస్తుంటారు. రోడ్డు కళకళలాడేలా చర్యలు తీసుకుంటారు. దానికి తగినట్లుగా టోల్ రుసుమును వసూలు చేస్తుంటారు. రాజీవ్ రహదారిపై కూడా ఇటు దుద్దెడలో, అటు గుండ్లపల్లి వద్ద రెండు చోట్లా టోల్‌గేట్‌లు ఉన్నాయి. రహదారి సరిగా లేదంటూ వాహనదారులు టోల్ పన్ను వసూలు చేసేచోట ఫిర్యాదులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. నిబంధనల ప్రకారం టోల్‌గేట్ల వద్ద ఉండాల్సిన వసతులను సైతం విస్మరిస్తున్నారు. ఇప్పటికైనా రహదారిని సక్రమంగా నిర్వహించకుంటే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు.



బెజ్జంకి మండలం తోటపల్లి వద్ద గుంతలు



జీజీహెచ్‌లోని నాలుగో ఫ్లోర్‌కు వెళ్లే ద్వారాలకు తాళాలు వేసిన అధికారులు

జీజీహెచ్‌లో నాలుగో ఫ్లోర్‌కు తాళం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● 'ఆంధ్రజ్యోతి'లో కథనానికి స్పందన

సిద్దిపేట టౌన్, జూలై30: సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో (జీజీహెచ్)లోని నాలుగో అంతస్తులో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంతో "జీజీహెచ్‌లో గలీజు" శీర్షికన ఆంధ్రజ్యోతి ఈనెల 29న కథనం ప్రచురించింది. ఈ కథనంపై అధికారులు, వైద్యులు, సిబ్బంది మధ్య తీవ్రస్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలోని నాలుగో ఫ్లోర్‌కు ఎవరూ వెళ్లకుండా ప్రధాన ద్వారానికి ఆసుపత్రి అధికారులు తాళాలు వేశారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్ స్పందిస్తూ ఆసుపత్రిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిందెవరనేది ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు.

జ్వర సర్వే వేగంగా నిర్వహించాలి

● ఆరోగ్యసిబ్బందికి డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ ఆదేశం



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్, హాజరైన వైద్యాధికారులు, సిబ్బంది

సిద్దిపేట టౌన్, జూలై 30: ఆరోగ్యసిబ్బంది వేగంగా జ్వర సర్వే నిర్వహించాలని సిద్దిపేట జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో పుట్ల శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సిద్దిపేటలోని కలెక్టరేట్ కార్యాలయంలోని వైద్యశాఖ కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రత, జ్వర సర్వేపై అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా జిల్లాకు వచ్చిన అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత సీజనల్ వ్యాధులపై, క్షేత్రస్థాయిలో ప్రజలకు అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అన్ని గ్రామాల్లో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించాలని, ముఖ్యంగా కలుషితమైన నీరు తాగడం వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. అన్ని గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించాలని, రక్త నమూనాలు సేకరించి తగిన చికిత్స అందించాలన్నారు. పాఠశాలల్లో, హాస్టళ్లలో ఆహార పదార్థాలు, వంట పాత్రలపై మూతలు ఉంచాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించాలని సూచించారు. గర్భిణుల వివరాలను నమోదు చేసి వారి ఆరోగ్య వివరాలు తెలుసుకోవడంతో పాటు ఇంటికి వెళ్లి పర్యవేక్షించాలని ఆయన చెప్పారు. అవసరమైన వారికి మందులను అందజేయాలని తెలిపారు. సమీక్షలో వైద్యులు రేవతి, ఎం.శ్రీనివాస్, నారాయణరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు, వినోద్ బాబ్జి, శ్రీకళ, ఆనంద్, అరుణ్ కుమార్, ఏవో రవీందర్‌రెడ్డి, సీసీ డానియల్, వైద్యాధికారులు సత్యనారాయణ ఏవో డెమో నవీన్‌రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మానవత్వం చాటిన కానిస్టేబుల్

● దివ్యాంగుడిని భుజాలపై ఎత్తుకుని పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లిన ఆసిఫ్

సిద్దిపేట అర్బన్, జూలై 30: సిద్దిపేట పట్టణం కరీంనగర్ రోడ్డులో ఉన్న సెంటర్‌లో మంగళవారం డీఎస్సీ పరీక్ష రాయడానికి వచ్చిన దివ్యాంగుడు మెట్లు ఎక్కి సెంటర్‌లోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాడు.. అక్కడే డ్యూటీలో ఉన్న సిద్దిపేట త్రీ టౌన్ కానిస్టేబుల్ ఆసిఫ్ తన భుజాలపై ఎత్తుకుని సదరు అభ్యర్థిని పరీక్షా కేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడే ఉన్న అభ్యర్థులు, అధ్యాపకులు కానిస్టేబుల్‌ను అభినందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, సీపీ అనురాధ కానిస్టేబుల్ ఆసీఫ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

సిద్దిపేట, చేర్యాలకు కొత్త మున్సిపల్ కమిషనర్లు

సిద్దిపేటటౌన్, జూలై 30: జీహెచ్‌ఎంసీలో విధులు నిర్వర్తిస్తున్న బి.సంధ్యను సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రసన్నరాణి వరంగల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

ఇటీవల సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్లను కమిషనర్ ప్రసన్నరాణి లెక్కచేయడం లేదని ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమె స్టేజీ నుంచి దిగి తమతో సమానంగా కింద కూర్చోవాలంటూ ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ విషయమై కమిషనర్ ప్రసన్నరాణి అదేరోజు డీఎంఏ డైరెక్టరేట్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు ఈ-మెయిల్ చేశారు. ఆ తర్వాత అధికారులు ఆరా తీశారు. ఈ నేపథ్యంలో మంగళవారం బదిలీ ఉత్తర్వులు రావడం గమనార్హం.

చేర్యాలలో..

చేర్యాల : జీహెచ్‌ఎంసీలో గ్రేడ్-2 అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.నాగేందర్ చేర్యాల మున్సిపల్ కమిషనర్‌గా నియామకమయ్యారు. కొన్నినెలల క్రితం ఇక్కడి కమిషనర్ రాజేంద్రకుమార్‌ను నిజామాబాద్ మున్సిపల్‌కు బదిలీ చేయడంతో ఆయన స్థానం ఖాళీ అయ్యింది. ఆతర్వాత ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా నాస్పూర మునిసిపల్ కమిషనర్ టి.రమేశ్‌ను నియమించినా అక్కడ గృహనిర్మాణ అనుమతుల మంజూరులో అవకతవకలకు పాల్పడటంతో నెలరోజుల్లోగా సస్పెన్షన్‌కు గురయ్యాడు. మార్చి 16న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ జి.నర్సయ్యకు చేర్యాల మున్సిపల్ పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. కానీ ఆయన సక్రమంగా అందుబాటులో లేకపోవడం, స్థానికంగా అస్తవ్యస్త పరిస్థితులు నెలకొనడంతో కార్యాలయ పాలన గాడితప్పింది. నాలుగునెలల పాటు ఆయా సేవలు సక్రమంగా అందకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పూర్తిస్థాయి మున్సిపల్ కమిషనర్‌ను నియమించాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై ఆయా పార్టీల నేతలు, ప్రజలు ఒత్తిడి తీసుకువచ్చారు. ఆయా పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం పూర్తిస్థాయి మున్సిపల్ కమిషనర్‌ను నియమించింది.

ఆర్టీసీ ఉద్యోగులు సైనికుల్లా పనిచేయాలి

● ఆర్టీసీ ఈడీ పురుషోత్తంనాయక్
● ఉద్యోగులకు 'ప్రగతి చక్ర' పురస్కారాలు

సంగారెడ్డి అర్బన్, జూలై 30 : ఆర్టీసీ ఉద్యోగులు సైనికుల్లా పనిచేయాలని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం నాయక్ పేర్కొన్నారు. మెదక్ రీజియన్ పరిధిలోని వివిధ డిపోల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు 'ప్రగతి చక్ర' పురస్కారాలను మంగళవారం అందజేశారు. సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉద్యోగులు అంకితభావం, నిబద్ధత, సేవా దృక్పథంతో పని చేస్తే సంస్థకు మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. అనంతరం రీజియన్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 20 మంది డ్రైవర్లు, ముగ్గురు టీం డ్రైవర్లు, 10 మంది కండక్టర్లు, ఐదుగురు గ్యారేజీ కార్మికులు, ఐదుగురు అద్దె బస్సు డ్రైవర్లకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా 31 ఏళ్లుగా ఒక్క యాక్సిడెంట్ చేయకుండా బస్సులు నడుపుతున్న డ్రైవర్లు రీజియన్ స్థాయిలో ముగ్గురు, డిపో స్థాయిలో ముగ్గురికి క్యాష్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎం ప్రభులత, డిప్యూటీ ఆర్ఎం దైవాధీనం, సంగారెడ్డి డీఎం ఉపేందర్, వివిధ డిపోల మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ.279,33,31,968 మాఫీ

● కలెక్టర్ మనుచౌదరి



జిల్లాకు సంబంధించిన రైతు రుణమాఫీ చెక్కు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటఅగ్రికల్చర్/హుస్నాబాద్ రూరల్/సిద్దిపేట అర్బన్ జూలై 30: రూ.లక్షన్నరలోపు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ అయినట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన రుణమాఫీ కార్యక్రమాన్ని కలెక్టర్‌లో ప్రొజెక్టర్ ద్వారా ప్రజాప్రతినిధులు, వ్యవసాయఅధికారులు, బ్యాంకర్లు, రైతులతో కలిసి కలెక్టర్ వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన రుణమాఫీ చెక్కును ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో (రూ.279,33,31,968) రెండు వందల డెబ్బై తొమ్మిది కోట్ల ముప్పై మూడు లక్షల ముప్పై ఒక్క వేల తొమ్మిది వందల అరవై ఎనిమిది రూపాయల రైతు రుణాలను మాఫీ చేసినట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా రైతులకు బ్యాంకుల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణమాఫీ నిధులను బ్యాంకుల నుంచి తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ఏదైనా సమస్య వస్తే వ్యవసాయ క్లస్టర్ స్థాయి నుంచి ఏఈవో, మండల వ్యవసాయ అధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారి అందుబాటులో ఉంటారని వారిని సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మహేశ్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు 15 రకాల యూనిట్లు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. మంగళవారం హుస్నాబాద్ మండలం పందిళ్లలో ఇందిరా మహిళా శక్తి పౌల్ట్రీ మదర్ యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం అక్కన్నపేట మండలం అంతకపేటకు చెందిన రమాదేవి డెయిరీ పార్లర్ యూనిట్‌కు సంబంధించిన రూ. 1.50 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు డీఆర్‌డీఏ ద్వారా శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందజేస్తుందని తెలిపారు. జిల్లాలో నాటుకోళ్ల పెంపకం కోసం యూనిట్‌కు రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పందిళ్లలో ఏర్పాటు చేసిన పౌల్ట్రీ మదర్ యూనిట్ ద్వారా పెంపకం చేసిన నాటు కోడి పిల్లలను స్వశక్తి సంఘాలకు తక్కువ రేటుకు అందజేస్తారని తద్వారా వారు ఇంటి వద్ద పెంపకం చేసుకోవడంతో నాటుకోడి డిమాండ్‌ను బట్టి ఆర్థిక లాభాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఫుడ్ ప్రాసెస్, మిర్చి పౌడర్, పసుపు పౌడర్, చేపల వంటల యూనిట్, మహిళా శక్తి క్యాంటిన్లు, డెయిరీ పార్లర్, మీ సేవా సెంటర్లు, పాల ఉత్పత్తికి సంబంధించి గేదెలు, ఆవుల పెంపకం యూనిట్లు, రైతులకు కావాల్సిన పనిముట్ల తయారీ యూనిట్, సోలార్ విద్యుత్ తదితర అనేక రకాల యూనిట్లు ఉన్నట్లు తెలిపారు. అనంతరం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి క్యాంటీన్‌ను సందర్శించారు. హుస్నాబాద్ ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన మాతా శిశు ఆసుపత్రిని పరిశీలించి భవనం పూర్తి చేసి ఆసుపత్రికి అప్పగించారా? అని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి, వెటర్నరి ఏడిఏ వెంకటరెడ్డి, డిటి రుక్మిణీ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కరుణాకర్,వాసుదేవ్,ఏపీఎం శ్రీనివాస్,సీసీలు అశోక్, తిరుపతి, శివ,బిక్షపతి,రవీందర్,జితేందర్,మండల సమాఖ్యా అధ్యక్షులు వాణి, మమత, వివోఏలు ఉన్నారు.

మత్తు పదార్థాలను వ్యతిరేకిద్దాం

మత్తు పదార్థాలను వ్యతిరేకించి విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. యూఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో మత్తుపదార్థాలను వ్యతిరేకిద్దాం బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం అని పోస్టర్‌ను కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యు ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి, జిల్లా అధ్యక్షుడు గుడికందుల రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు శేఖర్, నాయకులు మధు, వినయ్, శ్రావణ్ పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీకి గ్రీన్‌సిగ్నల్!

- ఆగస్టు 2న టెండరు ఖరారు
- జిల్లాలో 368 మత్స్యకార సంఘాలు
- 1710 చెరువుల్లో, 5 రిజర్వాయర్లలో చేపపిల్లలను వదలనున్న అధికారులు



సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 30 : మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉచిత చేపపిల్లల పంపిణీ పథకం కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా చెరువుల్లో చేప పిల్లల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంపై కొన్నాళ్లు నీలినీడలు కమ్ముకున్నా.. ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని నిర్ణయించడంతో మత్స్యకారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత ప్రభుత్వం విధించిన నిబంధనల్లో కొన్ని మార్పులు చేస్తూ టెండర్ల నిర్వహణకు ప్రభుత్వం ప్రకటన ఇచ్చిందని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

4.42 కోట్ల చేపపిల్లలు

వచ్చేనెలలో జిల్లాలోని జలాశయాలు, చెరువులు, కుంటల్లో 4.42 కోట్ల చేప పిల్లలను ఉచితంగా వదిలే అవకాశం ఉంది. ఈసారి వర్షాలు ఆలస్యం కావడం, చెరువుల్లో నీటిమట్టం తక్కువగా ఉండటంతో పథకం కొనసాగింపుపై ప్రభుత్వం ఏ విషయాన్ని వెల్లడించకపోవడం, తదితర కారణాలతో చేపపిల్లల పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. గతంలో జూలైలోనే చెరువుల్లో చేప పిల్లలను వదిలేవారు. ఫిబ్రవరి నెలాఖరు నుంచే చేపలు పట్టడం ప్రారంభమయ్యేది. కానీ ఈ ఏడాది ఆలస్యంగా పంపిణీ చేయడంతో ఎదుగుదల ఆశించిన మేరకు ఉండదని మత్స్యకారులు పేర్కొంటున్నారు.

ఆగస్టు 2న టెండర్లు ఖరారు

చేపపిల్లలను సరఫరా చేసేందుకు రాష్ట్ర మత్స్యశాఖ నోటిఫికేషన్‌ను 10న విడుదల విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేశారు. 23న చేప పిల్లలను ప్రభుత్వ ధరలకు సరఫరా చేసే వ్యాపారులు టెండర్లు వేసుకునే అవకాశం ఉండే కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు రెండు వరకు టెండర్ ప్రక్రియను పొడగించింది. ఆగస్టు 2న బిడ్ ఓపెన్ చేయనున్నారు. ఈ ఏడాది జిల్లాకు 4 రకాల చేప పిల్లలను ఇవ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. టెండర్ దక్కించుకున్న వారు అవసరమైన చేప పిల్లలు సరఫరా చేసే అవకాశం కల్పిస్తారు.

368 మత్స్య సహకార సంఘాలు

జిల్లాలో 330 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, 38 మహిళా సంఘాలు ఉన్నాయి. ఇందులో 23,920 మంది సభ్యులున్నారు. ఈ ఏడాది మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఆధ్వర్యంలో 4.42 కోట్ల చేప పిల్లలను గ్రామాల్లో గుర్తించిన 1710 చెరువులలో, 5 రిజర్వాయర్, కుంటల్లో పెంచాలని నిర్ణయించారు. జూలై నెలాఖరులోగా చేప పిల్లలను వదిలితే, బాగా పెరిగే అవకాశం ఉంది. ఆలస్యంగా వదలడం వల్ల అవి పెరిగే సమయానికి చెరువుల్లో నీళ్లు తగ్గిపోయి పెరుగుదల సరిగా ఉండదని మత్స్యకారులు పేర్కొంటున్నారు. జిల్లాలో స్థానికంగా విక్రయించే చేపలు, ఎక్కువ డిమాండ్ ఉండే రకాలను సరఫరా చేయాలని వారు కోరుతున్నారు. ఇక చేప పిల్లల సైజు సరిగా లేకపోవడం సకాలంలో సరఫరా చేయకపోవడంతో అవి పెరగడం లేదని పేర్కొంటున్నారు. చేప పిల్లలను ఆలస్యంగా చెరువుల్లో వేస్తే.. పెరగడానికి 15-18 నెలలవుతుందంటున్నారు. 35-40 ఎంఎం సైజుతో 1.78 కోట్లు, 82-100 ఎంఎం సైజులో 2.63 కోట్ల చేప పిల్లలను సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే.. కాంట్రాక్టర్లు వాటి కంటే తక్కువ సైజులో ఉన్న చేప పిల్లలను, ఎదుగుదల లేని రకాలను సరఫరా చేస్తున్నారని, నాణ్యమైన చేప పిల్లలను చెరువులలో వేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

పారదర్శకంగా చేప పిల్లల పంపిణీ

జలాశయాలు, చెరువుల్లో నీరు చేరిన తర్వాత చేప పిల్లలను పంపిణీ చేస్తాం. చేపపిల్లల సరఫరాకు రాష్ట్ర మత్స్యశాఖ ఆదేశాల మేరకు టెండర్లు పిలిచాం. ఈనెల 23న చివరి తేదీ ఉండగా.. ఆగస్టు రెండు వరకు టెండర్ ప్రక్రియ పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అదే రోజు బిడ్ ఓపెన్ చేస్తారు.

- మల్లేశం జిల్లా మత్స్యశాఖ అధికారి

మహాలక్ష్మి పథకంతో పెరిగిన రేషియో

● మెదక్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ప్రభులత



సిద్దిపేట అర్బన్, జూలై 30: మహాలక్ష్మి పథకంలో భాగంగా మెదక్ ఆర్టీసీ రీజియన్‌లో ప్రతిరోజు లక్షా 70 వేలమంది ప్రయాణం చేస్తున్నారని, పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఇప్పటివరకు ఉచిత ప్రయాణాన్ని మూడు కోట్ల 800 లక్షల మంది మహిళలు వినియోగించుకున్నారని మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత మంగళవారం తెలిపారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టక ముందు 70 శాతం ఉన్న ఆక్యుపెన్సీ రేషియో నేడు 98 శాతానికి చేరిందన్నారు. గతంలో ప్రతిరోజు సుమారు 1,80,000 మంది ప్రయాణం చేస్తే.. నేడు 2.60 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకుంటున్నారని ఆమె తెలిపారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా మెదక్ రీజియన్‌లో 10 డీలక్స్, 35 పల్లె వెలుగు, 42 ఎక్స్‌ప్రెస్ బస్సులు మొత్తంగా 87 కొత్త బస్సులు వచ్చాయన్నారు. ప్రయాణికుల సంఖ్య పెంచడానికి గిఫ్ట్ స్కీం పథకాన్ని కూడా ప్రవేశపెట్టామని తెలిపారు. సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మెరుగైన ఆరోగ్యం కోసం చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అలాగే ప్రయాణికులతో మెదులుకునే ప్రవర్తనపై కూడా శిక్షణ ఇచ్చామని చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించడానికి ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు.

తుర్కపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

● ఐదు తులాల బంగారం, 70 తులాల వెండి అపహరణ

నారాయణఖేడ్, జూలై 30: తాళం వేసిన ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ చేశారు. నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన కుర్మ ఆంజిగొండ తల్లి కిష్టమ్మతో కలిసి ఖేడ్‌లో బంధువు అంత్యక్రియలు వెళ్లాడు. ఆంజిగొండ భార్య శారద మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లింది. గుర్తుతెలియని దొంగలు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. రాత్రి 7 గంటలకు తల్లి కిష్టమ్మ, భార్య శారద ఇంటికి వచ్చి పరిశీలించగా బీరువా తాళం తీసి ఉండడంతో వెళ్లి చూడగా.. 5 తులాల బంగారు ఆభరణాలు, 70 తులాల వెండి ఆభరణాలు, రూ.32 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జీడిపల్లిలో మూడు తులాలు చోరీ

మనోహరాబాద్, జూలై 30: మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామంలో కూడా చోరీ జరిగింది. ఎస్ఐ సుభాష్ గౌడ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోల్లబోయిన శేఖర్ కుటుంబీకులతో కలిసి పని నిమిత్తం బయటకు వెళ్లి రాత్రి 8 గంటలకు వచ్చారు. ఇంట్లోకి వెళ్లి చూడగా సామాను చిందరవందరగా పడి ఉన్నది. అనుమానం వచ్చి బీరువాలో చూడగా.. 3 తులాల బంగారం, కొంత నగదును అపహరించారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నారాయణఖేడ్, జూలై 30: నిజాంపేట మండల కేంద్రానికి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. నిజాంపేట మండలం రాంరెడ్డిపేట్ గ్రామానికి చెందిన గూల రమేష్(27) ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో నిజాంపేట శివారులో 161వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు.

అధ్వానంగా అంగన్‌వాడీలు

- సొంత భవనాలు లేక తీవ్ర అవస్థలు
- ఇరుకు గదులు, అద్దె భవనాల్లో కొనసాగింపు
- శిథిలావస్థలో 34 భవనాలు
- పెండింగ్ బిల్లులతో సిబ్బంది ఇక్కట్లు

జోగిపేట, జూలై 30: అందోలు నియోజకవర్గంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు అధ్వానంగా ఉన్నాయి. అద్దె గృహాలు, సౌకర్యవంతంగా లేని గదులు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. దీంతో పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులను కేంద్రాలకు పంపడానికి ఇష్టపడడం లేదు.

అద్దె భవనాల్లో 65 కేంద్రాలు

నియోజకవర్గంలో మొత్తం 450 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 175 కేంద్రాలు సొంత భవనాల్లో నడుస్తుండగా, 141 కేంద్రాలు ఆయా గ్రామాల్లోని పాఠశాలలలకు అనుబంధంగా స్కూల్ బిల్డింగ్ లలో, మరో 141 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో సరైన వసతులు లేక, ఇరుకుగదుల్లో, అసౌకర్యాల నడుమ చిన్నారులు గడపాల్సిన దుస్థితి నెలకొన్నది. నియోజకవర్గంలోని 9 మండలాల్లో 65 కేంద్రాలకు ప్రభుత్వం నుంచి అద్దె డబ్బులు రాకపోవడంతో టీచర్లకు భారమవుతోంది.

శిథిలావస్థలో 34 కేంద్రాలు

నియోజకవర్గం మొత్తంగా 34 కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నట్టు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. వీటిలో అత్యధికంగా జోగిపేట సీడీపీవో పరిధిలోనే 23 కేంద్రాలు ఉండడం గమనార్హం. ముఖ్యంగా సంగుపేట, అల్మాయిపేట, అందోలు-1, మిన్‌పూర్, సింగూరు-2, ఖాదిరాబాద్, -1, మేడికుంద, దేవునూర్, ఇబ్రహీంపూర్ తదితర కేంద్రాల పైకప్పులు చిన్నపాటి వర్షాలకే కురుస్తున్నాయి. అల్లాదుర్గం మండలం గొల్లకుండ గిరిజనతండాలోని అంగన్‌వాడీ కేంద్రానికి తలుపులే లేవు. కొండారెడ్డిపల్లి, ఎర్రారం, మిన్‌పూర్, గొంగులూర్, పుల్కల్-3, కోడూరు, సింగూరు, పెద్దారెడ్డిపేట, కొర్పోల్, కేరూర్, గౌతాపూర్, పల్వట్ల, బిజిలీపూర్, ఖాదిరాబాద్, పాలడుగు, దేవునూర్ కేంద్రాల్లో తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ పూర్తిగా ధ్వంసమైంది. మునిపల్లి మండలం ఇబ్రహీంపూర్‌లోని కేంద్రం పెంకుటింట్లో ఉండడంతో, చిన్నపాటి వర్షాలకు కురుస్తోంది.


సంగుపేట కేంద్రంలో పైకప్పు నుంచి కారుతున్న వర్షపు నీటిని పట్టేందుకు ఏర్పాటు చేసిన గిన్నెలు

పోస్టుల ఖాళీ

నియోజకవర్గంలోని అంగన్‌వాడీల కేంద్రాల్లో సిబ్బంది లేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. జోగిపేట సీడీపీవోగా నియమితులైన నర్సింహారావు మూడేళ్లుగా హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి డిప్యూటేషన్ చేయించుకుని విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతోఅసిస్టెంట్ సీడీపీవో ప్రియాంక ఇన్‌చార్జి సీడీపీవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అల్లాదుర్గం సీడీపీవోగా నియామకమైన లిఖిత ఇక్కడి రాకుండానే హైదరాబాద్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో నర్సాపూర్ సీడీపీవో హేమభార్గవి ఇన్‌చార్జి సీడీపీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అల్లాదుర్గం ఏసీడీపీవోగా జ్ఞానేశ్వరి బాధ్యతలు తీసుకున్నరోజే సెలవు పెట్టి.. వారంరోజుల వ్యవధిలో నిజామాబాద్ జిల్లాకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఏసీడీపీవో పోస్ట్ ఖాళీగా ఉంది. జోగిపేట ఐసీడీఎస్ ప్రాజక్టులో ఒక సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఒక టైపిస్ట్, ఒక అటెండర్ పోస్టు ఖాళీగా ఉన్నది. 10 సూపర్‌వైజర్ పోస్టులకు ఏడుగురు పనిచేస్తుండగా.. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జోగిపేట ఐసీడీఎస్ పరిధిలో 262 మంది అంగన్‌వాడీ టీచర్లకు 256 మంది మాత్రమే పనిచేస్తుండగా, 6 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అల్లాదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 9 సూపర్‌వైజర్ పోస్టులకు కేవలం ఐదుగురినే ప్రభుత్వం నియమించిండది. వీరిలో ఒకరు హైదరాబాద్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లగా.. ఒకరు విధుల్లో ఉండగా.. 4పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

5 నెలలుగా అందని కూరగాయల బిల్లులు

బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వమే పోషకాహారాన్ని అందిస్తోంది. ఇందులతో భాగమైన కూరగాయల విషయంలోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒకరికి రోజుకు రూ.1.50 చొప్పున ప్రతినెలా కూరగాయల బిల్లులు చెల్లించాల్సి ఉంది. కానీ ఐదునెలలుగా బిల్లులు రాకపోవడంతో టీచర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సర్దుకోండని అధికారులు చెబుతున్నా.. ఆచరణలో సాధ్యం కావడం లేదని వాపోతున్నారు.

సమస్యలు తీర్చాలి

అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న తమకు కూరగాయల బిల్లుల భరించడం ఇబ్బంది అవుతుంది. సక్రమంగా వేతనాలు, కూరగాయల బిల్లులు చెల్లించాలి. పక్కా భవనాలు నిర్మించాలి. చిన్నారులకు ఆట వస్తువులు సమకూర్చాలి.

\- ఇందిరాగౌడ్, జోగిపేట డివిజన్ అంగన్‌వాడీ టీచర్ల సంఘం అధ్యక్షురాలు


శిథిలావస్థకు చేరిన అందోలులోని అంగన్‌వాడీ కేంద్రం


చౌటకూర్ మండలం హొన్నాపూర్‌లో నిలిచిన భవనం పనులు

చోరీ చేశాడని ఆరోపణ.. ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

- న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన


గుగులోత్ కుమార్ (ఫైల్)

శివ్వంపేట, జూలై 30: అనుమానాస్పదస్థితిలో ట్రాక్టర్ డ్రైవర్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని వెంక్యాతండాలో చోటు చేసుకున్నది. కాగా న్యాయం చేయాలని సంగారెడ్డి-తూప్రాన్ జాతీయ రహదారి శివ్వంపేటలో పోలీస్ స్టేషన్ ఎదుట మృతుడి బంధువులు ఆందోళన చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధి రెడ్యాతండా పంచాయతీ పరిధిలోని వెంక్యాతండాకు చెందిన గుగులోత్ కుమార్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా సోమవారం రాత్రి ట్రాక్టర్ బ్యాటరీ చోరీ చేశాడని ఆరోపిస్తూ.. కుమార్‌ను స్థానికులు చితకబాది కుటుంబీకులకు అప్పగించారు. ఈ క్రమంలో అవమానంతోనే కుమార్ మృతిచెందాడని బంధువులు ఆరోపిస్తూ.. న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్, జూలై 30: మద్యానికి బానిసై వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్ పట్టణంలో చోటుచేసుకున్నది. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన కుతాడి అలియాస్ పద్మిని సత్యనారాయణ(59)కి ఇద్దరు భార్యలు, మొదటి భార్య లక్ష్మి దౌల్తాబాద్‌లో ఉంటుండగా.. రెండోభార్య సత్యలక్ష్మి గజ్వేల్ పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇంటిలో ఉంటున్నది. సత్యలక్ష్మితో కలిసి ఉంటున్న సత్యనారాయణ మద్యానికి బానిసకావడంతో ఆరోగ్యం పాడైంది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన సత్యనారాయణ సోమవారం రాత్రి డబుల్ బెడ్‌రూం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొదటి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు. మొదటి భార్యకు కుమారుడు, రెండో భార్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

దుబ్బాక, జూలై 30: విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి దుబ్బాక మండలం రాజక్కపేటలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన తిరుపతియాదవ్(74) తన కుమార్తె ఇల్లు అయిన రాజక్కపేట గ్రామానికి వచ్చాడు. కుమార్తె వ్యవసాయ పొలం వద్ద ఒడ్లపై గడ్డిని కోస్తుండగా.. ప్రమాదవశాత్తు స్టాటర్ డబ్బాకు చెందిన విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు చూసి కుమార్తెకు సమాచారమందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ఆస్పత్రికి తరలించారు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


పంగ స్వామి(ఫైల్)

రాయపోల్, జూలై 30: రెండురోజుల క్రితం ఇంట్లో గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబసభ్యులు, ఎస్‌ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పంగ స్వామి(35) ఐదేళ్ల క్రితం అప్పుచేసి ఇల్లు కట్టుకున్నాడు. ఏడాది క్రితం మరింత అప్పు చేసి ఆటో కొనుగోలు చేశాడు. ఇంటికి, ఆటోకు కలిపి మొత్తం రూ.3 లక్షల వరకు అప్పులు అయ్యాయి. చేసిన అప్పులు తీరకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో రెండునెలల క్రితం ఆటోను అమ్మేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురై 28న అర్ధరాత్రి ఇంట్లో గడ్డి మందు తాగాడు. అనంతరం భార్యను నిద్రలేపి తాను గడ్డిమందు తాగానని చెప్పి పడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు ఆయనను గజ్వేల్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి 13 ఏళ్ల కొడుకు ఉన్నాడు. మృతుడి భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రసాయన వ్యర్థ జలాలు తాగి పాడిఆవు మృతి


మృతిచెందిన ఆవు

జిన్నారం, జూలై 30: కాజీపల్లి పారిశ్రామికవాడలో మేతకు వెళ్లిన ఆవు కాలుష్య జలాలు తాగి మృత్యువాత పడింది. కాజీపల్లికి చెందిన యవరైతు అభిమన్యుకు చెందిన పాడిగేదెలు, ఆవులు సోమవారం మేత కోసం గ్రామ శివారులోని పారిశ్రామికవాడ సమీపంలోకి వెళ్లగా రసాయన వ్యర్థ జలాలు తాగి మృత్యువాత పడినట్లు బాధితుడు తెలిపాడు. మరణించిన ఆవు విలువ రూ.లక్ష ఉంటుందన్నారు. తరచూ కాలుష్య జలాలు సేవించి పశువులు మరణిస్తున్నాయని అభిమన్యు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఇస్రో ప్రయోగాలపై అవగాహన


ఇస్రో ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్, జూలై 30: ఇస్రో శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధన ప్రయోగాలపై విద్యార్థులు తెలుసుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం తూప్రాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇస్రో శాస్త్రవేత్తల పరిశోధన ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భారతీయ అంతరిక్షా పరిశోధన సంస్థ గగన్‌యాన్-3పై ప్రచారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. చంద్రయాన్-3 విజయవంతమై ఏడాది అయిన సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నందాల శ్రీనివాస్, మామిండ్ల కృష్ణ, పల్లెర్ల రవీందర్‌గుప్తా, నేత మహేందర్‌రెడ్డి, రఘుపతి, కృషి విజ్ఞాన్ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ లక్ష్మీకాంతారావు, తహసీల్దార్ విజయలక్ష్మి, కమిషనర్ ఖాజా మొయిజొద్దీన్, ఇస్రో శాస్త్రవేత్తలు శంకరప్రసాద్, డాక్టర్ రాగమల్ల శ్రీనివాస్, టెక్నికల్ ఆఫీసర్ సుజయ్, ప్రధానోపాధ్యాయురాలు ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

ఖేడ్ మార్కెట్ ఛైర్మన్ పదవి ఎవరిని వరించునో..?

- మొదటిసారి ఎస్సీ జనరల్‌కు పదవి రిజర్వు
- ఆశల పల్లకిలో పలువురు ఎస్సీ నేతలు


ఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

నారాయణఖేడ్, జూలై 30: సంగారెడ్డి జిల్లాలోనే మారుమూల ప్రాంతంలో ఉన్న నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనని నియోజకవర్గ ప్రజలు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఖేడ్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీని ఏర్పాటుచేసిన అనంతరం మొదటిసారిగా ఎస్సీ సామాజికవర్గానికి ఛైర్మన్ పదవిని రిజర్వ్ చేయడంతో.. ఆ సామాజికవర్గానికి చెందిన పలువురు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఖేడ్ నియోజకవర్గం 1994కు పూర్వం జోగిపేట వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉండేది. అప్పట్లో విభజన చేసి నారాయణఖేడ్‌లో ప్రత్యేకంగా మార్కెట్ కమిటీని ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి ఓసీ, బీసీ సామాజికవర్గాలకు చెందినవారు ఛైర్మన్లుగా పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో పాటు కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎంపీగా సురేష్‌షెట్కార్ కొనసాగుతున్నారు. దీంతో పార్టీకి చెందిన ఎస్సీ సామాజికవర్గం నాయకులు పదవి కోసం ఇరువురు నేతలను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఛైర్మన్ పదవి కోసం కల్హేర్ మండలం క్రిష్ణాపూర్‌కు చెందిన దేవిదాస్, కంగ్టి మండలం చీమల్‌పాడ్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ రవి, మనూరు మండలం శెల్గిరకు చెందిన మాజీ జడ్పీటీసీ పురంజన్, నారాయణఖేడ్ మండలంజి.హుక్రానకు చెందిన అమృత్, సంజీవన్‌రావుపేటకు చెందిన సాయిలు, కల్హేర్ మండలం బీబీపేటకు చెందిన బండారు సాయిలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సంజయ్‌రాం, నాగల్‌గిద్ద మండలం ఎర్రబొగుడకు చెందిన స్వామిదాస్, తదితరులు నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కల్హేర్ మండలం క్రిష్ణాపూర్‌కు చెందిన దేవిదాస్, తండ్రి నుంచి కాంగ్రెస్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నారు. దివంగత కిష్టారెడ్డికి అనుచరుడిగా పనిచేయడమే కాకుండా పార్టీ జెండా మోస్తూ వస్తున్నాడు. జి.హుక్రాను చెందిన అమృత్ సైతం కాంగ్రెస్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నాడు. పార్టీ అధిష్టానం మాత్రం నారాయణఖేడ్‌లో ఉప ఎన్నిక జరిగిన సమయంలో పార్టీని వీడకుండా, పార్టీ జెండా మోసిన వారికే ఛైర్మన్ పదవిని కట్టబెట్టాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తుంది. ఏదిఏమైనా నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి కోసం ఆశావహుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. దీంతో ఛైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనని నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఛైర్మన్ పదవినే కాకుండా వైస్ ఛైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం కూడా ఎంపీ, ఎమ్మెల్యేల వద్ద పదవులను ఆశిస్తున్నవారు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నట్లు తెలుస్తోంది.

కేసుల విచారణలో లోపాలుంటే సహించేది లేదు

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ చెన్నూరి రూపేష్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, జూలై 30: కేసుల విచారణలో లోపాలుంటే సహించేది లేదని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకుంటూ కేసుల విచారణలో జాప్యం ఉండొద్దన్నారు. ప్రతి కేసులో నాణ్యమైన విచారణ చేసి బాధితులకు అండగా నిలవాలన్నారు. పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. పోలీస్‌స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు నివారణకు ప్రత్యేక దృష్టిసారించి ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రమాద హెచ్చరికా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫేక్ నంబర్ ప్లేట్లు, నంబరు లేని వాహనాలపై దృష్టిసారించాలని తెలిపారు. నేర నియంత్రణకు ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ రమేష్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివారు పురపాలికల్లో 44 గ్రామాలు విలీనం?

- ఎన్నికల ప్రక్రియ నిలిపివేత
- కొత్తగా రెండు కార్పొరేషన్లు ఏర్పాటయ్యే అవకాశం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఔటర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న 44 గ్రామపంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియ నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ గ్రామాలను సమీపంలోని పురపాలక సంఘాల్లో విలీనం చేసే కసరత్తు మొదలుపెట్టింది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆగస్టు మొదటివారంలోగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఇటీవల ప్రభుత్వం అధికారులకు ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే నగర శివార్లలోని ఔటర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ చేపట్టరాదని తాజాగా ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం. దీనిపై అధికారులు ఎవరూ మాట్లాడడానికి ఇష్టపడడం లేదు. కానీ గ్రామాల విలీన ప్రక్రియపై అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఈ గ్రామాలన్నీ ఔటర్ రింగురోడ్డుకు ఇరువైపుల అనుకున్న గ్రామాలే. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 11 గ్రామాలు ఉండగా మిగతావి మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉన్నాయి. ఇప్పటికే మున్సిపాలిటీగా ఉన్న ప్రాంతంలో ఎక్కువ గ్రామాలు కలిస్తే వీటిని కార్పొరేషన్ చేయాలని నిర్ణయించారు. ఇలా శివార్లలో కొత్తగా రెండు కార్పొరేషన్లు ఏర్పాటుకానున్నట్లు తెలిసింది. దీనికి ఇంకా తుది రూపు రావాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

ఆయిల్‌పామ్ సాగుతో రెట్టింపు ఆదాయం

- సంగారెడ్డి జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు

జహీరాబాద్, జూలై 30: ఆయిల్‌పామ్ సాగుతో రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని సంగారెడ్డి జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణ సమీపం రంజోల్ గ్రామంలోని బాబానగర్‌లో రైతు తిరుపతిరెడ్డి పొలంలో చేపట్టిన ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మెగా ప్లాంటేషన్‌లో భాగంగా 2024-25 సంవత్సరానికిగానూ జిల్లావ్యాప్తంగా 70 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటలను సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటలను రైతులు సాగుచేస్తున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 12 మండలాల్లో రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేసున్నారని పేర్కొన్నారు. అనంతరం మొక్కలు, తదితరాలను సరఫరాచేసే గోద్రేజ్ కర్మాగరం డీజీఎం స్వీటీ మాట్లాడుతూ రైతుల డిమాండ్ మేరకు తమవంతు బాధ్యతగా సహకరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు శ్రీధర్, శైలజ, ఏఈవో ప్రదీప్, రైతులు, గోద్రేజ్ సంస్థ అధికారులు బొంతు భరత్, వెంకటేశం, రాజేష్‌రెడ్డి, కేతన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టీం కెప్టెన్‌గా చైతన్యశ్రీ


చైతన్యశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చిన్నకోడూరు, జూలై 30: అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టీంకు కెప్టెన్‌గా సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని వడ్లకొండ చైతన్యశ్రీ ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ భూపాల్‌రాజు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా చైతన్యశ్రీకి కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జాతీయస్థాయిలో రాణించాలని వారు ఆకాక్షించారు.

అక్రమ నిర్బంధాలు నిలిపివేయాలి

● సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయి ఎల్లయ్య

గజ్వేల్, జూలై 30: అక్రమ నిర్బంధాలను నిలిపివేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలన అంటూనే అక్రమ నిర్బంధాలను ప్రయోగిస్తున్నదని, గామపంచాయతీ కార్మికుల జీతాలు పెంచాలని, ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చలో హైదరాబాద్ నిర్వహిస్తే కాంగ్రెస్ అక్రమంగా నిర్బంధించి గజ్వేల్ నియోజకవర్గవ్యాప్తంగా అరెస్టులు చేసిందని ఆరోపించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కోహెడ, జూలై 30: మండలంలోని నాగసముద్రాల ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 11 సంవత్సరాలుగా ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో పని చేస్తున్న పీజీటీ, టీజీటీ ఉపాధ్యాయుల సంక్షేమానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. హైల్త్‌కార్డులు లేక సమయానికి వేతనాలు రాక అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. కారుణ్య నియామకాలు, ఆరోగ్యకార్డులు, 010 ద్వారా వేతనాలు ఇచ్చేవిధంగా సీఎం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కె. శారద, యం.కె కె పావని, ఆర్ భవ్య, బి జ్యోతి, జి రాంనారాయణ, డి రమేష్, యం శైలేజ, జి రాజు, వి శ్రీనివాస్, జివిఎల్ ప్రసన్న, బి రమేష్ పాల్గొన్నారు.


సిద్దిపేట అర్బన్: మాట్లాడుతున్న నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర యువజన కార్యదర్శి

ఉపాధ్యాయ ప్రమోషన్లలో అన్యాయం

సిద్దిపేట అర్బన్, జూలై 30 : ఉపాధ్యాయ ప్రమోషన్లల్లో ఎరుకల కులానికి చెందిన కిషన్ అనే ఉపాధ్యాయుడికి అన్యాయం జరిగిందని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర యువజన కార్యదర్శి, బీఆర్ఎస్ నాయకుడు కెమ్మ సారం శ్రావణ్ ఆరోపించారు. సిద్దిపేట అర్బన్ ప్రెస్ క్లబ్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొండపాక మండలం దుద్దెడ మధుర షలాంపు ప్రభుత్వ పాఠశాలలో కిషన్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడని, ఇతర కులానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఎస్టీ అని నకిలీ సర్టిఫికెట్ చూపించి ప్రమోషన్ పొందాడని ఆరోపించారు. ఈ విషయమై ప్రభుత్వ ఉన్నత అధికారులకు వివరించామని అధికారులు స్పందించి విచారణ చేపట్టి నిజమైన ఉపాధ్యాయునికి న్యాయం చేయాలని కోరారు. ప్రమోషన్‌లో అన్యాయం జరిగిందంటూ సదరు ఉపాధ్యాయుడు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కూడా నిర్వహించాడు. విషయం తెలుసుకున్న ఎస్సీ, ఎస్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్ ఆయనకు మద్దతు తెలిపాడు.


వర్గల్: రామాయంపేట కెనాల్ వద్ద రైతులతో కలిసి నినాదాలు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

ఉత్తర తెలంగాణ రైతాంగంపై కక్ష సాధింపు..

వర్గల్, జులై 30: ప్రభుత్వం ఉత్తర తెలంగాణ రైతాంగంపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నదని గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని సింగాయిపల్లి వద్ద కొండపోచమ్మ ప్రాజెక్టు సంగారెడ్డి, రామాయంపేట కెనాల్ వద్ద మంగళవారం రైతుల, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సాగునీటికి ఇబ్బందులు లేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు కష్టాలు మొదలైయ్యాని తెలిపారు. వర్షపాతం తక్కువ ఉండడంతో పంట పొలాలకు నీరందక రైతులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. ప్రాజెక్టుల ద్వారా నీళ్లు వదలకపోతే రైతులతో కలిసి రాజీవ్ రహదారిని దిగ్గంధం చేస్తామని, తామే కొండపోచమ్మ ప్రాజెక్టు గేట్లు ఎత్తి రైతులకు సాగునీరు అందిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేలూరి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు కనకరాజు, మాజీ జడ్పీటీసీ బాలుయాదవ్, బీఆర్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు దేవగనిక నాగరాజు, మండల యూత్ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు వెంకటేశ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, చంద్రరెడ్డి, మురళీగౌడ్, కుమార్‌యాదవ్ తదితరులు ఉన్నారు.


కోహెడ: నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

డబుల్‌బెడ్ రూం ఇళ్లను పూర్తిచేయాలి

మిరుదొడ్డి, జూలై30: అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పూర్తిచేయాలని బీజేపీ నాయకులు రవి, గోపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మారంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను పూర్తిచేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

చెరువులు, రిజర్వాయర్లను నీళ్లతో నింపాలి

● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ నియోజకవర్గంలోని అన్ని చెరువులు, రిజర్వాయర్లలో నీరు అడుగంటిపోవడంతో పంటలు పండించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే గోదావరి జలాలు అందించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడారు. వరదలతో గోదావరినది ప్రవహిస్తున్నందున రంగనాయక సాగర్‌తో పాటు దేవాదుల ద్వారా జనగామ నియోజకవర్గంలోని చెరువులు, రిజర్వాయర్లు నింపాలని కోరారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



గుంతలు పూడ్చిన మట్టిరోడ్డు

చిన్నకోడూరు, జూలై 30: నాలుగు లైన్‌ల రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా చిన్నకోడూరులోని వివేకానంద విగ్రహం సమీపం నుంచి ఇల్లంతకుంట మార్గంలో సుమారు 1 కిలో మీటరు మేర పాత బీటీ రోడ్డును తొలగించి మట్టి పోసి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడి బురదమయంగా మారి వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఈనెల 28న ఆంధ్రజ్యోతిలో 'రహదారులు అధ్వానం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు పై ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చి చదును చేయించారు.

పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టాలి

● ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్

చేర్యాల, జూలై 30: ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ డిమాండ్ చేశారు. చేర్యాల మండలకేంద్రంలోని అంబేడ్కర్ నగర్ కాలనీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం తగదన్నారు. ఆగస్టు 6వతేదీన ఢిల్లీలోని జంత రమంతర్ వద్ద వంగపల్లి మహాదీక్ష చేపట్టనున్నారని, వర్గీకరణ డిమాండ్‌కు మద్దతుగా దీక్షకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహాదీక్ష కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు భూమిగారి దామోదర్, చుంచు తిరుపతి, పాకాల అనిల్, నగేశ్, భూమిగారి సంజీవులు, నర్సింహులు, నవీన్, కర్రోల్ల రవితేజ, సంజయ్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మిరుదొడ్డి/చేర్యాల/గజ్వేల్, జూలై 30: అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతెకు చెందిన మాజీ ఉపసర్పంచ్ గుంటి రమేష్ తల్లి ఇటీవల మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. అనంతరం భూంపల్లికి చెందిన అధికం రాజుకు రూ. 60 వేల సీఎంఆర్ఎఫ్‌ను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్, రంజిత్, బాల్ నర్సాగౌడ్, రాజురెడ్డి, రామస్వామి, శ్రీనివాస్ తదితరలున్నారు. ఇటీవల మాతృ వియోగం పొందిన చేర్యాల మునిసిపల్ బీఆరఎస్ ఫ్లోర్‌లీడర్ మంగోలు చంటిని గజ్వేల్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్, గజ్వేల్ మండల కార్యదర్శి రమేశ్ తదితరులు మంగళవారం పరామర్శించారు. వారివెంట బీఆర్ఎస్ యూత్ నాలుగు మండలాల అధ్యక్షుడు శివగారి అంజయ్య, కొమురవెల్లి మండల నాయకుడు మహేశ్ ఉన్నారు.

మాల మహానాడు నాయకుడు తుమ్మ శ్రీనివాస్ తల్లి ఇటీవల మృతి చెందగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి. వెంకటయ్య శ్రీనివాస్‌ను పరామర్శించారు. ఆయనవెంట గ్రామస్థులు తుమ్మ కనకయ్య, తుమ్మ యాదగిరి, తుమ్మ బాలమల్లు తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కుకునూరుపల్లి, జూలై 30: కుకునూరుపల్లికి చెందిన కర్నాల నవీన్, కోల సందీప్‌లకు సీఎం సహాయనిధి చెక్కులను ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ రవీందర్‌లు మంగళవారం అందజేశారు. మండలంలోని మంగోల్‌కు చెందిన మల్లయ్య అనారోగ్యంతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

మర్కుక్, జూలై 30: మర్కుక్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆరిఫాను మంగళవారం బీఆర్ఎస్ మండల బీసీసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య, మర్కుక్ మాజీ సర్పంచ్ భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం చిత్రపటం అందజేత

సిద్దిపేట అర్బన్, జూలై 30: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన మోహన్‌కు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్ గౌడ్, నవీన్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వేలం

మద్దూరు, జూలై 30: మద్దూరు పోలీసుస్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్న ఇసుకకు తహసీల్దార్ సంజీవ్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్ఐ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడారు. ఈ వేలంలో వల్లంపట్లకు చెందిన వ్యక్తి ఇసుక వేలాన్ని దక్కించుకున్నాడు. నాలుగు ట్రాక్టర్లతో పాటు లారీ ఇసుకకు నిర్వహించిన వేలం పాటల్లో రూ.9 వేలకు పాటకు దక్కించుకున్నట్లు ఆర్ఐ తెలిపారు

విద్యుదాఘాతంతో ఆవు మృతి

జగదేవ్‌పూర్, జూలై 30: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని తిగుల్‌లో మంగళవారం చోటుచేసుకున్నది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంగలి వెంకటయ్య తనకున్న రెండు ఆవులను మేత కోసం మధ్యాహ్నం సమయంలో గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో మేపుతున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తున్న క్రమంలో ఒక ఆవు విద్యుదాఘాతంతో మృతిచెందింది. సుమారు ఎనభై వేల ఆస్తినష్టం జరిగిందని రైతు వెంకటయ్య వాపోయాడు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

మిరుదొడ్డి, జూలై 30: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించినప్పుడే ఉపాధ్యాయులకు, తల్లీదండ్రులకు పేరుప్రతిష్టలు వస్తాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతరెడ్డిపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు నుంచి ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యిన 17మంది విద్యార్థులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులున్నారు.

విద్యాధరిలో కృత్తికా నక్షత్ర పూజలు

వర్గల్, జులై 30: వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కృత్తిక నక్షత్ర వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం దేవతామూర్తులకు విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ వేద పండితులు కృత్తిక నక్షత్ర పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు లక్ష పుష్పార్చన చేశారు. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు అధికంగా తరలివచ్చారు. పూజల అనంతరం క్షేత్రంలోని విద్యాసరస్వతీ అమ్మవారి ఆలయంతో పాటు ఉప ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసారాలు, మహా ప్రసాదాలను అందజేశారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అక్కన్నపేట, జూలై 30: ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అనంతరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్ మాట్లాడుతూ.. మండలంలోని గుబ్బడి గుట్టపై కొందరు కబ్జాదారులు బంజారాహిల్స్‌కాలనీ వెనకాల దాదాపు మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి పత్తి పంట సాగు చేస్తున్నారని ఆరోపించారు. అట్టి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సలేంద్ర తిరుపతి యాదవ్ తదితరులు ఉన్నారు.

గ్రామకంఠ కబ్జాపై అధికారుల విచారణ

జగదేవ్‌పూర్, జూలై 30: మండలంలోని తిగుల్ గ్రామంలో గ్రామ కంఠానికి సంబంధించిన ఎస్సీ కమ్యూనిటీ భవనం స్థలం కబ్జాకు గురైందని కాలనీవాసులు వాపోయారు. ఇదే విషయం వివిధ పత్రికల్లో ప్రచురితమవ్వడంతో మంగళవారం జగదేవ్‌పూర్ తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ ప్రవీన్, సర్వేయర్ హరీష్‌లు ఆ స్థలాన్ని పరిశీలించారు. కబ్జా చేసిన వ్యక్తితో పాటు, కాలనీవాసులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ రికార్డులో మాత్రమే పేరు నమోదు చేసుకున్నారని, భూమికి సంబంధించిన ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేవని అధికారులు తెలిపారు. వారివెంట కాలనీవాసులు నాగరాజు, మల్లేశం, రామస్వామి, పరశురాం, నర్సయ్య, ఉపేందర్, మహేందర్ తదితరులు ఉన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం

● టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్

గజ్వేల్, జూలై 30: ఉద్యోగుల సమస్యలపై టీఎన్జీవో నిరంతర పోరాటం చేస్తున్నదని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ యం. జానకిరాములు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని గజ్వేల్ బాలుర హబ్ హాస్టల్‌లో నిర్వహించగా, సిద్దిపేట టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమండ్ల విక్రమ్‌రెడ్డితో కలసి ఆయన హాజరయ్యారు. సమావేశంలో టీఎన్జీవో సిద్దిపేట జిల్లా సహాధ్యక్షుడు నిమ్మ సురేందర్‌రెడ్డి, కోశాధికారి అశ్వక్ అహ్మద్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, బి.లింగం, గజ్వేల్ టీఎన్జీవో అధ్యక్షుడు ఎస్.రాజశేఖరరెడ్డి, టీఎన్జీవో గజ్వేల్ ప్రధాన కార్యదర్శి ఎం.మద్దెల కమలాకర్, జనరల్ కార్యదర్శి(పిఆర్), జి అనిత, టీఎన్జీవో ఈసి మెంబర్ (పిఆర్)ఎం నరేష్‌చారి, పంచాయతీ కార్యదర్శి జి జయరాములు, పంచాయతీ కార్యదర్శి శ్వేత, హెచ్‌డబ్ల్యూవో లక్ష్మి, హెచ్‌డబ్లూవో స్వప్న, టీఎన్‌జీవో జేబీనా సుల్తానా, కార్యదర్శి నాగభూషణం, కార్యవర్గ సభ్యురాలు శ్వేత, శ్రీనివాస్, శివప్రసాద్ కోశాధికారి ప్రవీణ్, ఉద్యోగస్థులు పాల్గొన్నారు.

'పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి'


మాట్లాడుతున్న వెంకటరాములు

మర్కుక్, జూలై 30: ఉపాధ్యాయులు బేస్‌లైన్ టెస్ట్ ఆధారంగా ప్రతీ తరగతిలో ఏ, బీ, సీ గ్రూప్‌లుగా విభజన చేసి, సీ గ్రూప్ పిల్లలపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని నోడల్ అధికారి వెంకట్‌రాముల పేర్కొన్నారు. చేబర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ అమలు తీరు గురించి మండల నోడల్ అధికారి ఏ. వెంకట్‌రాములు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డిలు ఉపాధ్యాయులతో సమీక్ష జరిపారు. కార్యక్రమంలో నారెడ్డి రామకృష్ణారెడ్డి, ఎర్రవల్లి దయాకర్‌రావు, అంజలి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధుల లెక్క తేలేదెప్పుడు?

● అధికారులకు ఫిర్యాదు చేసిన నాయకులు

కుకునూరుపల్లి, జూలై 30: సోషల్ ఆడిట్లో భాగంగా మంగోల్ గ్రామంలో ఈ నెల 7న గ్రామసభ నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా 2023-24లో మంజూరైన రూ.4,60,560 గ్రామ పంచాయతీ అకౌంట్లో ఉన్న నిధుల లెక్కల రికార్డుల్లో లేకపోవడంతో పలువురు కాంగ్రెస్ నాయకులు అవినీతి జరిగిందంటూ ఆరోపిస్తున్నారు.

రికార్డుల్లో లేవు

ఎన్ఆర్ఈజీఎస్ నిధులు పక్కదారి పట్టాయని, నిధుల వివరాలు గ్రామపంచాయతీ రికార్డుల్లో లేవని దీనిపై సోషల్ ఆడిట్‌కు వచ్చిన ఎన్ఆర్ఈజీఎస్ ప్రత్యేక అధికారికి మంగోల్ పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహచారి, పలువురు నాయకులు ఫిర్యాదు చేశారు.

ఆడిటర్‌పై ఆరోపణలు

కొండపాక మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మండలస్థాయి సోషల్ ఆడిట్ సమావేశంలో మంగోల్ గ్రామ మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి అధికారులతో మాట్లాడుతూ.. సోషల్ ఆడిట్‌కు వచ్చిన ఎన్ఆర్ఈజీఎస్ ప్రత్యేక అధికారి అవినీతి జరిగిందని, దానికి 35వేల రూపాయలను ఇస్తే మీకు అనుకూలంగా ఆడిట్ చేస్తామని డబ్బులు డిమాండ్ చేశారని, అంతేకాకుండా తనకి సంబంధంలేని విషయంలో గ్రామ ఇన్‌చార్జి ఎంపీవో మంజూరైన నిధుల విషయంలో జోక్యం చేసుకున్నాడని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దాదాపు నెల రోజులు కావస్తున్నా ఇప్పటివరకు నిధుల దుర్వినియోగంపై ఎలాంటి విచారణ ప్రారంభించలేదు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు పక్కదారి పట్టాయా లేక సక్రమంగా వినియోగించారా అనేది అధికారులే తేల్చాల్సి ఉంది. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు దుర్వినియోగం కాలేదని జరిగిన పనులకు, వాటికి చెల్లించిన డబ్బులకు సరైన రికార్డులు ఉన్నాయని పంచాయతీ కార్యదర్శి రవలిక పేర్కొన్నారు. మంగోల్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ఉన్నతాధికారులకు నివేదించామని త్వరలో జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపడతారని ఎంపీడీవో తెలిపారు.


నిధుల దుర్వినియోగంపై విచారించాలని అధికారికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు(ఫైల్)

'బడ్జెట్‌లో ఆటో డ్రైవర్లకు మొండి చేయి'

హుస్నాబాద్, జూలై 30: ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ఆటో డ్రైవర్ల ఆర్థిక సహాయం విషయం లేకపోవడం బాధకరమని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు విమర్శించారు. హుస్నాబాద్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఆటో డ్రైవర్ల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా వారిని వంచించిందని ఆరోపించారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు గాదాసు రాంప్రసాద్, అధికార ప్రతినిధి నారోజు నరేష్, పోలోజు రాజేందర్, బొడిగే వెంకటష్, అశాడపు శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా శీత్లాభవాని ఉత్సవాలు


నైవేద్యం తీసుకువెళ్తున్న మహిళలు

అక్కన్నపేట, జూలై 30: మండలంలోని పంతులుతండా గ్రామ పంచాయతి పరిధిలోని తారచంద్ తండాలో గిరిజనులు మంగళవారం శీత్లాభవాని ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఊరి చివరన మైదాన ప్రాంతంలో తమ ఆరాధ్యదైవమైన శీత్లాభవానితో పాటు ఏడుగురు దేవతలకు నైవేద్యం తయారుచేసి అడపడుచులు నెత్తిన పెట్టుకుని అక్కడికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్


గజ్వేల్: సంబురాలు చేసుకుంటున్న నాయకులు

గజ్వేల్/ములుగు/జగదేవ్‌పూర్/మర్కుక్,జూలై 30: రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు రూ.లక్ష నుంచి లక్షా 50వేల వరకు రుణమాఫీ నిధులు జమచేసిన సందర్భంగా మంగళవారం గజ్వేల్ పట్టణంలోని రైతువేదిక వద్ద పట్టణాధ్యక్షుడు మోహన్నగారి రాజుతో కలిసి సంబురాలు చేసుకున్నారు. రైతు సంక్షేమం కోసమే ప్రభుత్వం నిరంతరం పనిచేస్తున్నదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నీలం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తూచాతప్పకుండా అమలు చేస్తుందన్నారు. రెండో విడత రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో రైతు వేదికలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏవో వసంతరావు, ఏఈవోలు శరణ్య, బాలకృష్ణ, రేఖ, కిరణ్, కాంగ్రెస్ తిగుల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సీపీఐ నాయకులు దయానంద్‌రెడ్డి పాల్గొన్నారు. రెండో విడత రుణమాఫీ కార్యక్రమాన్ని మర్కుక్ రైతువేదికలో రైతులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేందర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్, భానుశ్రీ, కాంగ్రెస్ నాయకులు సింగం వెంకటేష్, పాతూరు నర్సింలు, రైతులు పాల్గొన్నారు.

అత్తపై దాడిచేసిన అల్లుడికి రిమాండ్

చేర్యాల, జూలై 30: కుటుంబ తగాదాల నేపథ్యంలో కొమురవెల్లి మండలకేంద్రానికి చెందిన పాతకోటి చంద్రకళపై కత్తితో దాడి చేసి గాయపరిచిన ఆమె అల్లుడు చల్లా ఎల్లారెడ్డిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజు గౌడ్ తెలిపారు.

సీపీని కలిసిన ట్రస్మా ప్రతినిధులు


కమిషనర్‌కు మొక్కను అందజేస్తున్న ట్రస్మా సభ్యులు

సిద్దిపేట అర్బన్, జూలై 30: సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ, డీసీపీ మల్లారెడ్డిలను ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డి, జిల్లా ప్రతినిధులు భగవాన్‌రెడ్డి, సంపత్ కుమార్ తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సిద్దిపేట విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు జగ్గు మల్లారెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కమిషనర్ వెల్లడించారని ఆయన తెలిపారు.

'ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలి'

గజ్వేల్, జూలై 30: ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని ఎస్జీటీ యూనియన్ సభ్యులు పి.శ్రీనివాస్‌రావు, కె.దిలీప్‌కుమార్ డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ బాలుర పాఠశాలలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 26ఏళ్లుగా ఎస్జీటీగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇప్పటివరకు పదోన్నతులు కల్పించలేదని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయ పోస్టుల్లో కూడా బీఈడీ అర్హత కలిగిని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించలేదన్నారు. ఎస్జీటీలకు ఓటు హక్కు లేకపోవడంతో ఎమ్మెల్సీలు పట్టించుకోవడం లేదన్నారు.

రుణమాఫీ జాబితాలో పేర్లులేని వారు గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలి

● ఏవో రామకృష్ణ

మద్దూరు, జూలై 30: ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ జాబితాలో పేర్లు రాని వారు, ఏమైనా సందేహాలున్నా వ్యవసాయశాఖాధికారులు, క్లస్టర్ వారిగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏవో రామకృష్ణ సూచించారు. ఈ విషయమై ఏవో మాట్లాడారు. ప్రభుత్వం మొదటి విడుతగా ఒక లక్షలోపు రుణాలున్న రైతుల జాబితా పంపించిందన్నారు. అందులో పేర్లు రాని వారితో పాటు ఇంకా ఏమైనా సందేహాలున్నా క్లస్టర్ వారిగా ఉన్న రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో ఏ బ్యాంకులో రుణం పొందారో ఆ బ్యాంకు రుణం పొందిన స్టేట్‌మెంట్‌తో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు రాకేష్, అఖిల్ ఉన్నారు.

కుర్చీలు బహుకరించిన మాజీ ఎమ్మెల్సీ


ఫారుక్ హుస్సేన్ అందజేసిన కుర్చీలతో నాయకులు

దౌల్తాబాద్, జూలై 30: మండల పరిధిలోని హైమద్‌నగర్ గ్రామ పంచాయతీకి మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ మంగళవారం 200 కుర్చీలను బహుకరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు రణం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ గతంలో ఇచిచన మాట ప్రకారం హైమద్‌నగర్‌కు 200 కుర్చీలు అందజేయడం అభినందనీయమని కొనియాడారు.

'బల్మూరు వెంకట్‌ను గెలిపించుకుంటాం'

గజ్వేల్, జూలై 30: రాష్ట్రంలో జరగబోయే యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా పోటీ చేయనున్న ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ నర్సింగరావును గెలిపించుకుందామని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. బల్మూరు వెంకట్‌ను మంగళవారం తన అనుచరులతో పాటు కలిసి బండారు శ్రీకాంత్‌రావు మద్దతు ప్రకటించారు. ఆయనతో పాటు టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్, ములుగు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు మద్దూరి మల్లారెడ్డి, గంగిశెట్టి శ్రీనివాస్, చాడ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

● కాంగ్రెస్ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్, జూలై30: యువత రాజకీయాల్లోకి రావాలని, ప్రభుత్వంలో భాగస్వాములై ప్రజా సంక్షేమం కోసం నూతన పథకాలు అమలు చేసేలా కృషి చేయాల్సిన బాధ్యత వారిపై ఉందని సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, కాంగ్రెస సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో యువజన విభాగం నాయకులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే యువ నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీ పథకాలను అమలుచేసి చూపామన్నారు. సిద్దిపేట జిల్లాలో ఆగస్టు 5న యువజన విభాగం ఎన్నికలు దశలవారీగా నిర్వహిస్తామని చెప్పారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ అమలు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రియాజుద్దీన్, నాయకులు సాకీ ఆనంద్, బుచ్చిరెడ్డి, సందీప్‌యాదవ్, ఆలకుంట మహేందర్, ముద్దం లక్ష్మి, మార్క సతీష్‌గౌడ్, మజర్ మాలిక్, కలిముద్దీన్, వహాబ్, అజ్మత్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

● తహసీల్దార్‌కు మదిరాజ్ నాయకుల వినతి

మద్దూరు, జూలై 30: ఆర్థికంగా వెనుకబాటుకు గురైన ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని కోరుతూ మంగళవారం సిద్దిపేట జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి చొప్పరి సాగర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా చొప్పరి సాగర్ మాట్లాడుతూ.. అభయహస్తంలో పేర్కొన్న హామీ ప్రకారం ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలన్నారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఏర్పాటు చేస్తూ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కారయక్రమంలో ముదిరాజ్ మహాసభ కార్యదర్శి గీస బిక్షపతి, వెంకటేష్, సంతోష్, రాజు, శ్రీనివాస్, కనకయ్య, నర్సింహులు, చంద్రయ్య, ఇస్తారి, గణేష్, రాములు, సాయిలు పాల్గొన్నారు.

కులం పేరుతో ఎవరిని దూషించవద్దు

● అక్కన్నపేట ఎస్ఐ విజయ్‌భాస్కర్

అక్కన్నపేట, జూలై 30: కులం పేరుతో ఎవరిని దూషించవద్దని అక్కన్నపేట ఎస్ఐ విజయ్ భాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని కట్కూర్‌లో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అయనవెంట ఇందులో ఆర్ఐ జహీద్, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

● మిరుదొడ్డి ఎస్ఐ పరుశురాములు



మిరుదొడ్డి: మాట్లాడుతున్న ఎస్ఐ

మిరుదొడ్డి/దౌల్తాబాద్/మద్దూరు, జూలై 30: ప్రతి ఒక్కరూ సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలని మిరుదొడ్డి ఎస్ఐ పరుశురాములు సూచించారు. మిరుదొడ్డి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం సైబర్‌నేరాలు, బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌పై షీటీంతో కలిసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది తదితదిరులున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్‌ప్రేమ్‌దీప్ హెచ్చరించారు. మండల పరిధిలోని శేరిపల్లిబందారం వద్ద ఆయన ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ఎస్ఐ వెంట హెడ్‌కానిస్టేబుల్ సాంబశివరావు, సతీష్ తదితరులు ఉన్నారు. మద్దూరు మండల కేంద్రంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ కింద సాయంత్రం 4 నుంచి 5 గంటలకు వరకు వాహన తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జగదీశ్వర్, జమిందారు శంకరయ్య, కానిస్టేబుళ్లు పరుశురాములు, మహేందర్, సురేష్ ఉన్నారు.

'కూలర్ల 'గోల్‌మాల్' పై చర్యలు తీసుకోవాలి'

చేర్యాల, జూలై 30: వేసవికాలం దృష్ట్యా కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాధికారులు కొనుగోలు చేసిన కూలర్ల విషయంలో చోటుచేసుకున్న గోల్‌మాల్‌పై విచారణ చేపట్టాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు యువకులు మంగళవారం ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. బహిరంగ మార్కెట్‌లో ఓ ప్రముఖ బ్రాండ్ కూలర్ రూ.9,800కు లభిస్తున్నా రూ.12,800 చొప్పున కొనుగోలు చేసి ఒక్కో కూలర్‌కు రూ.3000చొప్పున పక్కదోవ పట్టించారని ఆరోపించారు. మార్కెట్‌లో తక్కువధరకు లభించేవాటిని కొనుగోలు చేయాల్సి ఉన్నా చేతివాటం ప్రదర్శించేందుకే నిబంధనలు ఉల్లంఘించారని, ఈవిషయమై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో వుప్పల వంశీ, కరుణాకర్ ఉన్నారు.